# భగవంతునితో చేరినప్పుడే ఆనందము

ఇంద పూజ్యమాయ ఓణం దివసం
ఎల్ల జనన్‌గలుకుం ఎండె పరిపూర్ణ అనుగ్రహం ఆశీర్వాదం!

పవిత్రమైన ఈ ఓణం పర్వదినమున మీకందరికి నా పరిపూర్ణమైన అనుగ్రహపూర్వకమైన ఆశీస్సులు అందిస్తున్నాను.

నిగమాలు హరియించి నిందు దూషణ జేసె
సోమకాసురుడేమి సుఖమునొందె?
పరసతి నాశించి పదితలల్వాడేమి
కట్టుకు పోయెను గట్టిగాను?
ఇల సూదిమొనయంత ఈయజాలనటన్న
దుర్యోధనుండేమి దోచుకొనియె?
పసిపాపలను కూడ కసిపట్టి చంపిన
కంసుడేపాటి ప్రాణంబు కాచుకొనియె?
నేటి దుర్మార్గులకుగూడ నిదియె గతియు
నేడు కాకున్న రేపైన నిలువరిచట
పెట్టుకొనబోకు ఏ ఆశ పెద్దగాను
మితము గలిగియుండుటే మేలు నీకు

వేదములను అపహరించి, భగవంతుని నిందించి సోమకాసురుడు ఏమి ఆనందమును అనుభవించాడు? రాముణ్ణి బాధపెట్టిన పదితలల రావణుని పరిస్థితి ఏమైనది? పాండవులకు సూదితల మోపినంత భూమి కూడా ఇవ్వటానికి అంగీకరించని దుర్యోధనుడు చివరకు ఏమి తీసికొనివెళ్ళాడు? పసికందుల్ని కిరాతకంగా హతమార్చిన కంసునికి చివరికి ఏ గతి పట్టింది ? ఈ రోజున కూడా దుర్మార్గులకు పట్టే గతి అదే. ఈనాడు కాకపోతే రేపైనా వారి కర్మ

sri sathyasai vachanamrutam

వారనుభవించవలసిందే. మీరు మితిమీరిన కోరికలతో ఉండకండి. సంయమనముతో జీవితం గడపండి.

## విశ్వమంతా సత్యముపై ఆధారపడి ఉంది

దివ్యాత్మస్వరూపులారా! ప్రపంచమంతా సత్యముతో నిండి ఉంది. సత్యము సర్వాంతర్యామి. సమస్తవిధములైన సంపదలు, సౌఖ్యములు, అనుకూలములు అన్నీ సత్యముపైనే ఆధారపడి ఉన్నాయి. సత్యము లేకపోతే ప్రపంచమునకు మనుగడయే లేదు. ఈనాడు మానవుడు కష్టములను అనుభవించుటకు కారణం అతడు సత్యమును విస్మరించుటయే. సత్యమును ఎవ్వరూ దాచలేరు, దానిని ఎవ్వరూ మార్చలేరు. "త్రికాలాబాధ్యం సత్యం" సత్యము భూత భవిష్యత్ వర్తమానకాలములలో మార్పు చెందనిది. ప్రాచీన కాలమునుండి భారతదేశము శాంతి సౌఖ్యములతో అలరారుచుండుటకు కారణము ఇచటి ప్రజలు సత్యమునంటి పెట్టుకొని ఉండటమే. భారతీయులు ప్రపంచమంతటా ఆధ్యాత్మిక సందేశమును వ్యాప్తిగావించారు. "లోకాః సమస్తాః సుఖినోభవంతు!" అన్ని లోకముల వారు సుఖముగా ఉందురుగాక! అనేది వారి ఆశయము. అటువంటి పవిత్రమైన ఆశయమును ఈనాడుమరచిపోయినారు. "సత్యాన్నాస్తి పరోధర్మః" సత్యమును మించిన ధర్మము వేరొకటి లేదు. సత్యము మానవ జీవితమునకు ప్రాణము. మానవతా విలువలన్నీ సత్యముపై ఆధారపడి ఉన్నాయి.

అన్ని గుణములలోకి ఉత్తమ గుణము సత్యమే. సత్యము కోసము రాజ్యాన్ని, భార్యను, కుమారుణ్ణి త్యాగం చేసిన హరిశ్చంద్రుని కథ మీరు వినే ఉంటారు.

> సత్యంబునందుండి సర్వంబు సృష్టించె
> సత్య మందణంగె సర్వ సృష్టి
> సత్య మహిమ లేని స్థలమేది కనుగొన్న
> శుద్ధ సత్యమిదియె చూడరయ్య!

సత్యమనేది చిన్న పదముగా అనిపిస్తుంది. కాని దాని గొప్పదనమును గ్రహించటం చాలా అవసరం. ఉన్న సమస్తమూ సత్యముతోనే ముడిపడి ఉంది. విశ్వమంతా సత్యముపైనే ఆధారపడి ఉంది. ఆధారమే లేకపోతే ఇక జీవితములో మిగిలేదేమిటి? సత్యములేని చోటే



sri sathyasaivachanamrutam

లేదు.

## ఎట్టి సంకల్పమో అట్టి ఫలితము

బలిచక్రవర్తి సత్యముపై ఆధారపడి ప్రవర్తించేవాడు. అతడు తన ప్రజలను కన్నబిడ్డలవలె చూసుకుంటూ తన విధులు నిర్వర్తించేవాడు. బలి గొప్ప దాతృత్వము గలవాడు. అతడు దయార్ద్రహృదయుడు. సత్య నియమము పాటించటంవల్ల అతడు సూర్యునివలె తేజరిల్లుతూ ఉండేవాడు. ఆనాడు అతడు కేరళను పరిపాలించటంవల్లనే ఈనాడు కేరళ సుఖసంతోషములతో ఉన్నది. అతడు తన శక్తితో చిన్న చిన్న దేవతలనందరినీ జయించాడు. అతడు తన విజయ సూచకంగా నర్మదానదీ తీరములో విశ్వజిత్ అనే యజ్ఞం చేశాడు. అప్పుడు భగవంతుడు వామనుడుగా అవతరించాడు. అతడు ఉత్తములైన అదితి కశ్యపులకు జన్మించాడు. వారు సిద్ధాశ్రమము అనే చోట ఉండేవారు.

బలి చక్రవర్తి యజ్ఞంచేసే చోటకు వామనుడు వెళ్ళాడు. ఆ బాలుడు తేజస్సుతో తేజరిల్లుతూ ఉండటంవల్ల అందరూ అతణ్ణి చూడసాగారు. వామనుడు దివ్యమైన ఆకర్షణతో ఉన్నాడు. బలిచక్రవర్తి కూతురైన రత్నమాల ఆ బాలుణ్ణి చూడగానే ఆమెలో పుత్రభావం పెల్లుబికింది. “ఆహా! ఏమి ఇతని తేజస్సు! ఏమి ఇతని ముఖవర్చస్సు! ఇతడే నా కుమారునిగా పుట్టి ఉంటే ఇతనిని లాలించి, పాలించి, ఆడించి ఎంతో ఆనందాన్ని అనుభవించేదానను కదా!” అని అనుకున్నది. ఇంతలో వామనమూర్తి బలిచక్రవర్తిని పాతాళానికి పంపించటం చూసి “ఛీ, ఇలాంటి దుర్మార్గుడు నాకు కొడుకుగా పుట్టాలని ఆశించానా? ఇతనికి విషం కలిపిన పాలిచ్చి చంపాలి” అని అనుకున్నది. వెంటనే సర్వజ్ఞుడైన వామనుడు రత్నమాల మనస్సులోని భావాలను గ్రహించి ఆమెవైపు చూచి “తథాస్తు!” (అట్లే అగుగాక!) అన్నాడు.

భగవంతుడు సర్వాంతర్యామి. “సర్వతః పాణిపాదం, తత్ సర్వతోక్షి శిరోముఖం, సర్వతః శ్రుతిమల్లోకే సర్వమావృత్య తిష్ఠతి” (ఆయన హస్తములు, పాదములు, నేత్రములు, శిరస్సులు, నోరు, చెవులు, విశ్వమంతటా వ్యాపించి ఉంటాయి) భగవంతుడు నిరంతరము అందరిని ఆశీర్వదిస్తూ ఉంటాడు. అందువల్లనే మన మనస్సులు ఎల్లప్పుడూ మంచి భావాలతో నిండి ఉండాలి.

sri sathyasai vachanamrutam

వామనుడు రత్నమాలతో "అమ్మా! మొదట నీవు నన్ను చూచి ఈ బాలునికి పాలివ్వగలిగితే ఎంత ధన్యత" అని భావించావు. కాని నీ తండ్రి పతనంకాగానే నీ కోరిక మారిపోయింది. నాకు విషం ఇచ్చి చంపితే బాగుండునని అనుకున్నావు. నీవు ద్వాపరయుగంలో పూతనగా పుట్టి నాకు విషపు పాలను ఇచ్చి నీవు మరణిస్తావు" అని పలికాడు. భగవంతుడు ఎప్పుడూ తథాస్తు! తథాస్తు! అంటూ ఉంటాడు. కాబట్టి ప్రతి వ్యక్తి నిరంతరము మంచి ఆలోచనలతోనే ఉండాలి. అజ్ఞానంవల్ల ఈ సత్యము గ్రహింపలేక మానవులు వివిధ విధములైన చెడు తలంపులతో జీవిస్తున్నారు.

**చెడు చూడకు, మంచి చూడు**
**చెడు వినకు, మంచి విను**
**చెడు తలచకు, మంచి తలచు**
**చెడు పలుకకు, మంచి పలుకు**
**చెడు చేయకు, మంచి చేయి**
**ఇదే భగవంతుని చేరే మార్గము!**

కాబట్టి నీ ఆలోచనలు పవిత్రంగా ఉన్నట్లయితే, నీవు పవిత్రంగా ఉండేలా ఆశీర్వదింపబడతావు. మనము మన మనస్సులను, సమయాన్ని దుస్సంగంలో గడుపుతున్నాము. కాని ఫలితాలు అనుభవంలోకి వచ్చేటప్పటికి విచారం కలుగుతున్నది. ప్రతి ఆలోచన వచ్చేది మనస్సునుంచే. కాబట్టి ఆ ప్రతిదానికి ఫలితంకూడా నిశ్చయం అవుతూ ఉంటుంది. రత్నమాలకు అదే పరిస్థితి ఏర్పడింది. కష్టం రాగానే మీరు భగవంతునిపై నెపం వేస్తారు. కాని మీ కష్టాలకు మీ ఆలోచనలే కారణమని మీరు గ్రహింపలేకపోతున్నారు. అందుకనే మీరు మంచి ఆలోచనలతో సత్సంగంలో ఉండండి.

**బలిచక్రవర్తి సత్యపాలకుడు**

బలిచక్రవర్తి దానశీలుడు. చాలా పుణ్యాత్ముడు. రాక్షసకులంలో జన్మించినప్పటికీ అతనిలో దైవభావాలు ఆవిర్భవించాయి. తన మాట నిలబెట్టుకొనటంకోసం సమస్తాన్ని త్యాగం చేశాడు. వామనుడు మూడు అడుగుల నేల కోరాడు. బలి ఒక క్షణం కూడా సంకోచించకుండగా

sri sathyasaivachanamrutam

సరేనన్నాడు. కాని అతని గురువైన శుక్రాచార్యుడు అడ్డుపడ్డాడు. అతడు బలితో "నీ ఎదుటనున్నవాడు సాక్షాత్తు విష్ణువే. ఒకసారి అతనికి నీవు మాట ఇచ్చావా ఇక వెనుతిరగలేవు. కాబట్టి తొందరపడి నీవు అతనికి ఎటువంటి వాగ్దానము చేయకు" అన్నాడు. అందుకు బలి శుక్రాచార్యునితో మాట తప్పటంకన్నా పాపము వేరొకటి లేదని పలికి వామనునకు ఇచ్చిన మాటను నెరవేర్చటానికి నిశ్చయించాడు. సత్యమును పాటించటం కోసం ఎటువంటి కష్టమునైనా సహించటానికి అతడు సిద్ధపడ్డాడు. అందువల్ల మహావిష్ణువు అతనిని పాతాళానికి పంపి అక్కడ అతనికి అన్ని సౌకర్యాలు సమకూర్చాడు. పాతాళలోకంలో ఉండికూడా అతడు చిరంజీవిగా ఉండిపోయాడు. అతడు వామనుణ్ణి ప్రతి సంవత్సరం కేరళకు వచ్చి ఆ భూమిని ఆశీర్వదించమని ప్రార్థించాడు. అందువల్లనే కేరళ వాసులు ఈరోజుకు "ఓణం" అని పేరుపెట్టి దీనిని భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు.

బలిచక్రవర్తికున్న సుగుణముల వల్లనే ఈనాడు కేరళవాసులు ఎన్నో ప్రయోజనాలు అనుభవిస్తున్నారు. ఓణం అంటే తీపి పదార్థాలు చేసికొని ఒకటే తినటం కాదు, బలివామనుల సమావేశాన్ని మనం గుర్తుచేసుకోవాలి. ఈనాడు కేరళలో భౌతికంగా వామనుడు సంచరిస్తాడు కాబట్టి వారు ఈ రోజును ఆనందప్రదంగా జరుపుకుంటారు.

మనము నీతినియమాలతోకూడిన ఆధ్యాత్మిక జీవితం గడపాలి. "సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్, నబ్రూయాత్ సత్యమప్రియం" సత్యం పలకాలి, ప్రియం పలకాలి, అప్రియమైన సత్యాన్ని పలుకకూడదు. ఈ మూడు నీతి, నియమము, ఆధాత్మికపు విలువలతో కూడినవి. ఈ మూడు చివరకు సత్యముపై ఆధారపడిఉన్నాయి. సత్యమార్గమును అనుసరిస్తూ, ఆధ్యాత్మిక జీవితమును గడుపుతూ మనం ప్రపంచ క్షేమంకోసం పాటుపడాలి. కేరళ సహజంగా కమ్యూనిజం బాగా ఉన్న రాష్ట్రం. అయినప్పటికీ రాజకీయంగా ఎలా ఉన్నా కూడా కేరళలోని ప్రతివ్యక్తీ ప్రతిరోజూ చక్కగా స్నానంచేసి, ముఖాన విభూతిగాని, గంధంకాని పెట్టుకొని, దేవాలయానికి వెళ్ళివస్తూ ఉంటాడు. వారి దివ్యమైన ప్రేమ, భక్తులు సామాన్యమైనవి కావు. కేరళ అందమైన రాష్ట్రం. అచటివారంతా ఆధ్యాత్మికమైన ప్రవృత్తిగలవారు. కాని క్రమంగా సున్నిత హృదయులు కఠినహృదయులుగా మారిపోతున్నారు. ఎందువల్ల? మన ప్రవర్తనమే

sri sathyasai vahanamrutam

కారణము. ఒక ప్రాంతంలోని ఒక వ్యక్తి ప్రవర్తన యొక్క ప్రభావము మొత్తము భూమి అంతటా పడుతుంది.

**ఆకార మానవులు కాదు, ఆచార మానవులు కండి**

దేశకాలపరిస్థితుల ప్రభావం చేత మానవుని హృదయం కఠినంగా మారిపోతూ వచ్చింది. ఏ దేశంయొక్క మంచి చెడ్డలయినా ఆ దేశంలో ఉన్న స్త్రీ పురుషుల ప్రవర్తనపై ఆధారపడి ఉంటాయి. ధనముపోతే ఏదీ పోయినట్లు కాదు, ఆరోగ్యముపోతే కొంత పోయినట్లు, గుణముపోతే సమస్తమూ పోయినట్లే. కాబట్టి ప్రతి వ్యక్తి తన ప్రవర్తనను, గుణమును సంరక్షించుకోవాలి. ఇదే ఎప్పటికీ భగవంతుని కోరిక. మానవులు ఈ సత్యమును గుర్తింపకుండగా, సంపదలు ప్రోగుచేసుకొనటంలో, ఇంకా స్వార్థపూరితమైన చర్యలలో కాలం గడుపుతూ ఉన్నారు. ఈ స్వార్థమును హృదయమునుంచి సమూలంగా పెకలించివేయాలి. అందరూ ఒక్కటే, అందరిపట్ల సమభావంతో ఉండండి. ప్రపంచంలో మానవులంతా ఒక్క కుటుంబమే. నీవు నాస్తికుడవైనా, ఆస్తికుడవైనా, యువకుడవైనా, వృద్ధుడవైనా మానవజాతిలో ఒక భాగము అని గుర్తుపెట్టుకో. నీవు మానవతా విలువలు పెంపొందించుకో. ఆ విలువలు లేనప్పుడు నీవు మానవుడవే కాదు. మానవునిలో కోపము, కోరిక, లోభము, అసూయ మున్నగునవి ఉన్నాయి. కాని అవి జంతులక్షణాలు. కోపము కుక్క యొక్క లక్షణము. చంచలత్వము కోతి లక్షణము. నీవు కుక్కవు కాదు, కోతివి కాదు. నీకు బాగా కోపం వచ్చినప్పుడు – నేను కుక్కను కాదు అని పలుమార్లు అనుకో. అప్పుడు నీ కోపము అదృశ్యమవుతుంది. ఈనాడు మానవులలో చాలా జంతులక్షణాలు ఉంటున్నాయి. ఇది సరిచేసుకోవాలి. మానవ లక్షణములు ఏమిటి? దయ, సత్యము, సహనము, సానుభూతి ఇవి. వీటిని మనం పెంపొందించుకోవాలి.

భగవంతుని చర్యలు రకరకములుగా ఉంటాయి. వాటి అర్థములు మనకు తెలియవు. అందువల్ల వాటికి మనం ప్రతిచర్యలు తలపెడతాము. ఆ ప్రతిచర్యలు కేవలం మన ఆలోచనలకు సంబంధించినవి. అంతేకాని అవి సత్యస్వరూపము నకు సంబంధించినవి కావు. నీలో ఉన్న కోపము అవతలి వ్యక్తిది అనుకుంటావు. అదేవిధంగా లోభము, అసూయ, గర్వము, భ్రాంతి

srisathyasaivachanamrutam

మున్నగునవి మనలో ఉన్నవే ఇతరులలో ఉన్నవానివలె కనిపిస్తాయి.

భగవంతుడు సత్యమైనవాడు. దేనికీ అంటనివాడు, నిస్వార్థపరుడు. అటువంటి దివ్యత్వమునకు నీలోనున్న నీ లోపాలను అంటగడుతుంటావు. దానివల్ల ఏ ప్రయోజనమూ లేదు. త్వరలోనే వాటి ఫలితాలను నీవు అనుభవింపవలసివస్తుంది. అందువల్ల అటువంటి భావాలు నీలో ప్రవేశించే సమయంలోనే నీవు వాటిని అడ్డుకోవలసి ఉంటుంది. పెట్రోలియం, బొగ్గు వంటి ఎన్నో పదార్థాలు భూమినుంచి బయటకు తీస్తున్నాము. అవి మొదట ఎక్కడ నుండి వస్తున్నాయి? చాలా సంవత్సరాలుగా అవి భూమిలో ఉంటూ ఉన్నాయి. ఇప్పుడు అవి బయటపడ్డాయి. అదేవిధంగా కోరిక, కోపము, ద్వేషము మున్నగు హీన గుణాలు నీ లోపల చాటుగా స్థిరపడిపోయి ఉన్నాయి. ఏదో ఒక సమయంలో అవి బయటపడాలి. అవి నీ లోపలకు ప్రవేశించకుండా జాగ్రత్తపడు. అదే నిజమైన మానవతా విలువ. నీ కోపాన్ని నీవు అదుపు చేయటం నీ బలహీనతకు గుర్తు. నిజానికి ఆ గుణము నీ లోపలకు ప్రవేశించకుండా చేయటమే నీవు చేయవలసినది.

## సత్య, ప్రేమల ఏకత్వమే దైవత్వం

ప్రేమస్వరూపులారా! మీలో మానవత్వం వికసించాలంటే సత్య, ప్రేమలను ఆధారంగా చేసుకోండి. సత్య, ప్రేమలచేతనే బలిచక్రవర్తి ఉన్నత స్థానమును పొందాడు. అతడు తన అంతరాత్మను అనుసరించాడు. దేహం ఒక నీటి బుడగ, మనస్సొక పిచ్చికోతి. కాబట్టి దేహమును, మనస్సును అనుసరించకూడదు. అంతరాత్మను అనుసరించాలి. ఆత్మ ఏనాటికీ మారదు, ఏనాటికీ నశించదు.

> **"చావు పుట్టుక లేనట్టి శాశ్వతుండు**
> **ఆదిమధ్యాంతరహితు డనాదివాడు**
> **తాను పుట్టక చావక చంపబడక**
> **ఆత్మరూపుడై అంతట వెలసియుండు"**

అలాంటి దైవత్వాన్ని మీరేరీతిగా అర్థం చేసుకోగలరు? మీరేవిధంగా భావించినా అది కేవలం మీ Imagination (భ్రమ) అని చెప్పవచ్చు. భగవంతుడు ఏ కర్మను ఆచరించినప్పటికీ



sri sathyasaivachanamrutam

దానికి ఎన్నో కారణాలుంటాయి. ఆ కారణాలను గుర్తించుకోలేక కొంతమంది భగవంతుణ్ణి విమర్శిస్తుంటారు. అవన్నీ వారి అంతర్భావములయొక్క ప్రతిబింబములే! కామక్రోధలోభమోహమదమాత్సర్యాది దుర్గుణాలు మానవునిలోనే ఉన్నాయిగాని, పరమాత్మునిలో లేవు. పరమాత్మ నిర్మలం, నిర్గుణం, నిశ్చలం, నిస్వార్థం... అట్టి పవిత్రమైన భగవంతునిలో దోషములున్నాయని భావించటం అవివేకం. కనుక మొట్టమొదట మానవుడు తనలో ఉన్న దుర్భావాలను దూరం చేసుకోవాలి. సద్గుణాలను ఆవిర్భవింపజేసుకోవాలి. వాటిని తాను అనుభవించి పదిమందికి పంచాలి. అదియే నిజమైన మానవత్వం.

ప్రేమ చాలా ప్రధానమైనది. ప్రేమయే దైవం. ప్రేమలో జీవించండి. మీ హృదయంలో ప్రేమ ఒక్కటి ఉంటే ఇంక అందులోకి ఏ దుర్గుణములూ ప్రవేశించుటకు వీలుకాదు. హృదయం ఒక్కరు మాత్రమే కూర్చోవటానికి వీలుకల్పించే 'సింగిల్ సోఫా' వంటిది. ఇది 'డబుల్ సోఫా' కాదు 'మ్యూజికల్ ఛైర్' కాదు. కాబట్టి అందులో ప్రేమను నింపుకుంటే ఇంకొకటి ప్రవేశించటానికి వీల్లేదు. ఈనాటి మానవుని హృదయంలో ప్రేమ లేకపోవటంచేతనే అనేక దుర్గుణాలు అందులోకి ప్రవేశిస్తున్నాయి. కనుకనే నేను అప్పుడప్పుడు చెబుతుంటాను – "మీ దినచర్యను ప్రేమతో ప్రారంభించండి. ప్రేమతో నింపుకోండి. ప్రేమతో అంత్యం గావించండి. దివ్యత్వానికి ఇదే మార్గం!" ప్రేమను మించినది లేదు. సత్య, ప్రేమలు అవినాభావసంబంధం కల్గినవి, ఒకదానినొకటి ఆశ్రయించియున్నవి. సత్యము అంతర్వాహిని, ప్రేమ బహిర్వాహిని. "అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్యనారాయణ స్థితః" ఈ రెండింటి ఏకత్వమే నారాయణత్వం.

**పాపభీతి లేని పామరత్వముబట్టి**
**దైవప్రీతి లేని దానిబట్టి**
**మానవత్వమణగె మానవులందున**
**విశ్వశాంతి కిదియె విప్లవంబు**

మీరు మంచివారుగా ఉంటే ప్రపంచమంతా మంచిదవుతుంది. కనుక మొట్టమొదట మీరు మంచివారు కండి. ఆ మంచిని ఇతరులకుకూడా అందించటానికి ప్రయత్నించండి. ఒకరిపట్ల ఒకరు ప్రేమతో మెలగండి. ప్రేమలేని హృదయం మరుభూమివంటిది. కనుకనే, అలనాటి

sri sathyasai vahanamrutam

గోపికలు చెప్పారు – ప్రేమరహిత మరుభూములలో... ప్రేమాంకురములు పెంపొంద... ప్రేమావేశముతో... ప్రేమసుధావర్షము వర్షింపగ... ప్రేమనదులు ప్రవహింపగ... మురళీగానము సేయగదె! కృష్ణా, గానము సేయగదె!" మీ హృదయాన్ని ప్రేమతో నింపుకోవాలి. లౌకికమైన, భౌతికమైన ప్రేమ ప్రేమ కాదు. ఆధ్యాత్మిక ప్రేమ ఒక్కటే నిజమైన ప్రేమ. అది హృదయం నుండి ఆవిర్భవిస్తుంది. అట్టి ప్రేమను మీరు పెంచుకోవాలి. లౌకికమైన ప్రేమ నెగెటివ్; హృదయసంబంధమైన ప్రేమ పాజిటివ్. మీరు పూజలు చేస్తున్నారు, ధ్యానం చేస్తున్నారు. కాని, ఇవన్నీ నెగెటివ్ చర్యలు. మీరు చేతిలో జపమాల త్రిప్పుతుంటే మీ మనస్సు మార్కెట్‌కు పోతున్నది. ఏమి ప్రయోజనం? మీ మనస్సు జపములోనే లీనమైపోవాలి. మనస్సును విచ్చలవిడిగా విడిచిపెట్టకూడదు.

"మనయేవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః" మానవుని బంధమోక్షములకు మనస్సే కారణం. తాళంలో తాళపుచెవిని పెట్టి కుడివైపుకి త్రిప్పితే తాళం తెరుచుకుంటుంది, ఎడమవైపుకి త్రిప్పతే అది మూసుకుంటుంది. మీ హృదయమనే తాళంలో మనస్సనే తాళపుచెవిని పెట్టి లోకంవైపు త్రిప్పితే బంధన చేకూరుతుంది; దైవంవైపు త్రిప్పితే మోక్షం ప్రాప్తిస్తుంది. ఈనాటి మానవుని మనస్సు ఎప్పుడు చూసినా ప్రపంచంవైపే పోతున్నదిగాని, ఆధ్యాత్మికంవైపు పోవటం లేదు. ఈ ప్రాకృతమైన జగత్తులో అనుభవించేదంతా అశాశ్వతమైనది. ఆత్మతత్త్వం ఒక్కటే సత్యం. ఆత్మ 'రియాలిటీ' (సత్యం), ప్రపంచం 'రిఫ్లెక్షన్' (ప్రతిబింబం). మనస్సును ఆత్మవైపుకి త్రిప్పితే అది Merge (మోక్షం), ప్రపంచంవైపుకి త్రిప్పితే అది Marriage (బంధన). ఈ Marriage అనేది ఒక Mirage (ఎండమావి) వంటిది. ఎందుకంటే, ఇందులో ఆనందమున్నట్లు కనిపిస్తుందిగాని, నిజంగా ఆనందం లేదు. ఏకత్వంలోనే నిజమైన ఆనందమున్నది. "ఏకం సత్ విప్రాః బహుధా వదన్తి" అదియే ఆత్మతత్త్వం.

**"నాలుక జారితే నరకమెరా!"**

ఈనాడీ హాలులో కేరళవారు మధురమైన మాటలు మాట్లాడారు, పాటలు పాడారు. ఆ మాటలు, పాటలు ఎక్కడికి పోయినాయి? సర్వత్రా వ్యాపించినాయి. ఈ టేబుల్‌లోనూ, ఆ స్తంభాలలోనూ, ఆ గోడలలోనూ... అంతటా చేరి పోయినాయి. మీకు వినపడినప్పుడు

srisathyasaivachanamrutam

ఫలానాచోట పాడుతున్నారనుకుంటారు. కాని, మీకు వినిపించకుండా ఆ శబ్దతరంగాలు సర్వత్రా వ్యాపించియున్నాయి. భగవంతుడు శబ్దస్వరూపుడు.

కనుకనే "శబ్దబ్రహ్మమయి, చరాచరమయి, జ్యోతిర్మయి, వాఙ్మయి, నిత్యానందమయి, పరాత్పరమయి, మాయామయి, శ్రీమయి" అని భగవంతుణ్ణి వర్ణిస్తున్నాము. భగవంతుని 'వైబ్రేషన్' ఒకచోట ఉన్నది, మరొకచోట లేదని చెప్పటానికి వీలుకాదు. మన వాక్కే సరస్వతీ స్వరూపం. కనుక మాటలను సరియైనరీతిలో ఉపయోగపెట్టుకోవాలి. ఎవ్వరినీ విమర్శించకూడదు, దూషించకూడదు. నాలుకకు ఎముక లేదు. అది ఎట్లా త్రిప్పితే అట్లా తిరుగుతుంది కదాయని ఇష్టమొచ్చినట్లు మాట్లాడకూడదు. "కాలు జారితే కలుగదు కష్టం, నాలుక జారితె నరకమెరా!" అన్నారు. కనుక నాలుకను జారనివ్వకుండా చూసుకోవాలి. ఎవ్వరినీ నొప్పించని రీతిగా మాట్లాడాలి. మధురంగా మాట్లాడాలి. అదే మానవుని ప్రధానమైన లక్షణం.

ఈనాటి మానవుడు ఉదయం లేచినది మొదలు రాత్రి పరుండునంతవరకు జానెడు పొట్టను నింపుకోవటానికి ఎన్నో అవస్థలు పడుతున్నాడు, ఎన్ని వ్యాపారములో చేస్తున్నాడు, ఎంత ధనమునో ఆర్జిస్తున్నాడు. కాని, ఎంత సంపాదించినా తృప్తి చెందటం లేదు, ఇంకా కావాలని ఆశిస్తున్నాడు. పోయేటప్పుడు తానేమైనా ధనమును వెంట గొనిపోగల్గుతున్నాడా? ధనం ఎంత అవసరమో అంత ఉండాలి. ధనం వస్తుంది, పోతుంది. కాని, నీతినియమాలు వస్తే అభివృద్ధి చెందుతాయి. కనుక మొట్టమొదట వాటిని సంపాదించుకోవాలి. పశువులకైనా కొన్ని నియమాలుంటాయి. వాటికొక 'రీజన్' ఉంటుంది, 'సీజన్' ఉంటుంది. కాని, నేటి మానవునికొక 'రీజన్' లేదు, 'సీజన్' లేదు. తాను కలిమిని, బలిమిని, చెలిమిని పెంచుకోవటానికి ప్రయత్నిస్తున్నాడే గాని, సద్గుణములను పెంచుకోవటానికి ప్రయత్నించటం లేదు. సద్గుణములే మనకు శాశ్వతమైనవి. అవి లేకపోతే కలిమి, బలిమి, చెలిమి... ఇవన్నీ వ్యర్థమైనవే.

## దేహతత్త్వం – జీవతత్త్వం – దైవత్వం

బలిచక్రవర్తి గుణములందుకూడా మహాబలుడే. కనుకనే అతనికి 'మహాబలి' అని పేరు వచ్చింది. అలాంటి చక్రవర్తి ఏలిన కేరళ సామాన్యమైన ప్రదేశం కాదు. ప్రపంచపటంలో అది

sri sathyasai vachanamrutam

చాలా చిన్నదిగా కనిపించవచ్చు. కాని అది భగవంతుడు వామనమూర్తిగా అవతరించిన పవిత్రమైన ప్రదేశం. విశ్వామిత్రుడు యాగము చేసినది అక్కడే. "ఓం భూర్భువస్సువః..." అంటూ మహాపవిత్రమైన గాయత్రీమంత్రమును బోధించినది అక్కడే. ప్రపంచమంతటా ఈ మూడే ఉన్నాయి. "భూః" – అనగా 'మెటీరియలైజేషన్'. "భువః" – అనగా 'వైబ్రేషన్'. "సువః" – అనగా 'రేడియేషన్'. 'మెటీరియలైజేషన్' – దేహతత్త్వం. 'వేబ్రేషన్' – జీవతత్త్వం. ఇంక 'రేడియేషన్' – దైవత్వం. ఈ మూడూ మానవునియందే ఉన్నాయి. కనుకనే నేను అప్పుడప్పుడు చెబుతుంటాను – "నీవు ఒక్క వ్యక్తివి కాదు, నీలో ముగ్గురున్నారు. 1. నీవనుకునే నీవు (దేహం) 2. ఇతరులనుకునే నీవు (మనస్సు) 3. నిజమైన నీవు (ఆత్మ). ఈ సత్యాన్ని గుర్తించినప్పుడే నీవు నిజమైన మానవునిగా రూపొందుతావు. దేహముపై మమకారమును పెంచుకోకూడదు. అయితే ఉన్నంతవరకు దీనిని కాపాడుకోవాలి. కర్మమార్గమునకు దేహం ఆధారం. ఉపాసనకు మనస్సు ఆధారం. జ్ఞానమునకు హృదయం ఆధారం. ఈ మూడింటి ఏకత్వాన్ని గుర్తించుకోవాలి.

త్రిదళం త్రిగుణాకారం త్రినేత్రంచ త్రియాయుధం
త్రిజన్మ పాపసంహారం ఏకబిల్వం శివార్పణం

భగవంతునికి ఏమి అర్పితం చేయాలి? "పత్రం పుష్పం, ఫలం, తోయం..." అన్నారు. దేహమే పత్రం, హృదయమే పుష్పం, మనస్సే ఫలం, ఆనందబాష్పములే తోయం. ఈ నాల్గింటినీ భగవంతునికి అర్పించాలి.

**మీరు మానవులు కారు, దైవస్వరూపులే!**

ప్రేమస్వరూపులారా! మీరు భగవంతుణ్ణి పూజించటానికి దేవాలయము నకు వెళ్ళనక్కర్లేదు. "దేహో దేవాలయః ప్రోక్తో జీవోదేవస్సనాతనః" దేహమే దేవాలయం. ఇందులో ఉన్న జీవుడే దేవుడు. గుండెయే భగవంతుని గుడి. కనుక మీరందరూ దైవస్వరూపులే. వేదము "సహస్ర శీర్షా పురుషః సహస్రాక్షః సహస్ర పాత్..." అని చెప్పింది. I am not a man. I am God (నేను మానవుడిని కాదు, నేను దైవాన్ని) అని మీరు విశ్వసించండి. అప్పుడు మీరు తప్పకుండా దైవత్వాన్ని పొందుతారు. "బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి" మీరు దేనిని ధ్యానిస్తారో ఆ

sri sathyasai vachanamrutam

రూపాన్ని పొందుతారు. "నేను మానవుడను" అని భావిస్తే మీరు మానవులుగానే ఉంటారు. "నేను దైవాన్ని" అని విశ్వసిస్తే మీరే దైవంగా రూపొందుతారు. నిజంగా మీరు మానవులు కారు, దైవస్వరూపులే. ఆకారంలో మీరు మానవులేగాని, దివ్యమైన ఆత్మ మీలో ఉంటున్నది. అట్టి ఆత్మను గుర్తించాలంటే మీ హృదయాన్ని పవిత్రంగా ఉంచుకోవాలి. హృదయాన్ని పవిత్రం గావించుకునే నిమిత్తమై మనం అనేక పర్వదినములను జరుపుకుంటున్నాము. పవిత్రత ఎక్కడుంటుందో అక్కడే దివ్యత్వం సాక్షాత్కరిస్తుంది.

**చలించని మనస్సు, భ్రమించని దృష్టి ఉండాలి**

ప్రేమస్వరూపులారా! ఈనాడు ఆధ్యాత్మికమునకు అనేక అంతరాయములు కల్గుతున్నాయి. అయితే, ఇవన్నీ తాత్కాలికమైనవేగాని, శాశ్వతమైనవి కావు. మానవుని మనస్సు అసలే చంచలమైనది. దానికి మరింత చంచలత్వమును పెంచే వాతావరణం ప్రపంచంలో అధికమౌతున్నది. కారణమేమిటి? ఈనాడు లోకంలో ఎక్కడ చూసినా అనేకమంది మాతాజీలు, స్వాములు, బాబాలు పుట్టుకొస్తున్నారు. ఎవరినైనా సరే, ఒక్కసారి నమ్మిన తరువాత జీవితాన్ని చాలించేంతవరకు ఆ నమ్మకాన్ని నిల్పుకోవాలి. నమ్మిన దైవానికే జీవితాన్ని అర్పితం చేయాలి.

దైవం ఒక్కడే. "ఏకం సత్..." అదే నిజమైన దైవత్వం. ఆ ఒక్కదానినే మీరు ఆశించండి, విశ్వసించండి, అనుసరించండి. అనవసరంగా వారివద్దకు, వీరివద్దకు పోయి మీలో ఉన్న నమ్మకాన్ని పాడుచేసుకోవద్దు. ఒకచోట మొక్కను నాటిన తరువాత దానికి ఎరువు వేసి నీరు పోసి పెంచాలి. అట్లుగాకుండా, ఆ మొక్కను ఇక్కడ కొన్ని రోజులు, అక్కడ కొన్ని రోజులు.. ఈరీతిగా పెరుకుతూ, పాతుతూ ఉంటే అది ఎంతకాలం బ్రతుకుతుంది? అట్లే, ఆధ్యాత్మిక మార్గంలో ఇష్టమొచ్చినట్లు గురువులను మార్చుకోవటం వ్యభిచార భక్తి అవుతుందేగాని, నిజమైన భక్తి కాజాలదు. అలాంటి చంచలత్వానికి మీరు తావీయకూడదు. అందరియందు భగవంతుడున్నాడని విశ్వసించండి. ఎందుకంటే 'మమైవాంశో జీవలోకే జీవభూతస్సనాతనః" అని భగవద్గీత చెప్పింది. కనుక అందరినీ భగవత్స్వరూపులుగా భావించండి, తప్పు లేదు. కాని, ఇది వదలి అది, అది వదలి మరొకటి... ఇలా మార్చుకునేవారు దొంగభక్తులేగాని, సరియైన భక్తులు కారు. మీ భక్తి నిర్మలమైనదిగా, నిశ్చలమైదిగా, నిస్స్వార్థమైనదిగా ఉండాలి.

srisathyasaivachanamrutam

ఎన్ని కష్టనష్టములు సంభవించినా వాటిని తట్టుకొని, నెట్టుకొని ముందుకు సాగాలి.

ఎంతోమంది భక్తులు, సాధువులు, మహనీయులు, పతివ్రతలు ఎన్నో కష్టములను ఎదుర్కోవలసి వచ్చింది. కాని, వారు పట్టిన పట్టు విడువకుండా దైవానుగ్రహాన్ని సాధించగల్గారు. మహాభక్తురాండ్రైన మీరా, సక్కుబాయిలు ఎన్ని కష్టములకు గురి అయినారో మీకు తెలుసు. మీరాను భర్తయైన మహారాణాయే తప్పు పట్టి బయటికి నెట్టాడు. ఆ సంఘటన ఆమెకు 'షాక్' మాదిరి తగిలింది. అయితే, అది ఒక్క సెకెండు మాత్రమే. తక్షణమే ధైర్యాన్ని కూడదీసుకుంది.

**"చలోరే మన్... గంగా యమునా తీర్**
**గంగాయమునా నిర్మల్ పానీ**
**శీతల్ హోత్ శరీర్... చలోరే మన్..."**

అని పాడుకుంటూ ద్వారకకు బయల్దేరింది. ఇడ, పింగళ – ఈ రెండింటికీ మధ్యనున్న సుషుమ్నయే గంగాయమునా తీరము. అక్కడికి వెళ్ళవలసిందిగా ఆమె తన మనస్సుకు బోధించింది. అలాంటి స్థిరమైన భక్తిని మీరు పోషించుకోవాలి. శంకరాచార్యులవారుకూడా చెప్పారు –

**భజ గోవిందం భజ గోవిందం**
**గోవిందం భజ మూఢమతే**
**సంప్రాప్తే సన్నిహితే కాలే**
**నహి నహి రక్షతి డుకృఙ్ కరణే**

మహనీయుల బోధనలన్నీ సత్యమైనవి, నిత్యమైనవి. అలాంటి బోధనలను మీరు అనుసరిస్తూరావాలి. అంతేగాని, నేడొకటి, రేపొకటి... ఈరీతిగా మార్చుకుంటూపోతే మీ హృదయం మాలిన్యమౌతుంది. చలించని మనస్సును, భ్రమించని దృష్టిని కల్గియుండాలి. ఇదియే నిజమైన భక్తుని లక్షణం. భగవంతుడు గంగానదివంటివాడు. భగవంతుణ్ణి వదలిపెట్టి ఆ వ్యక్తిని, ఈ వ్యక్తిని ఆశ్రయించటం ఎలాంటిదంటే, పవిత్రమైన గంగానదిని వదలిపెట్టి చిన్నచిన్న బావులను త్రవ్వుతూ కూర్చోటంవంటింది. ఈ 'బావుల'ను త్రవ్వటం Waste of

sri sathyasai vachanamrutam

time, Waste of money, Waste of energy (కాలమును, ధనమును, శక్తిని వృథా చేయటం) అనే చెప్పవచ్చు. గంగాసమానుడైన భగవంతుడు ప్రక్కనే ఉండగా ఇంక బావులను త్రవ్వవలసిన అవసరమేమున్నది? భగవంతునికి 'నియర్'గా, 'డియర్'గా ఉండి ఆనందాన్ని అనుభవించండి.

"ఏక ప్రభు కే అనేక నామ్'. భగవంతునికి అనేక పేర్లున్నాయి. ఏ పేరుతోనైనా పిలువవచ్చు. కాని, దైవం ఒక్కడే అని గుర్తించండి. మీరు "కేశవాయనమః మాధవాయనమః ..." అంటూ సహస్రనామార్చన చేస్తుంటారు. ఇన్ని పేర్లను ఉచ్చరిస్తూ ఒకే విగ్రహానికి పూజ చేస్తారు కదా! అనగా ఇవన్నీ ఒకే భగవంతునియొక్క వేర్వేరు పేర్లే. రాముడు, కృష్ణుడు, అల్లా, జీసస్...అందరూ ఒక్కటే. ఈ భావాన్ని మీ హృదయంలో ప్రతిష్ఠించుకొని జీవితాన్ని సార్థకం చేసుకోండి. నిరంతరం ఆనందంగా జీవించండి. ఆనందము భగవంతునితో చేరినప్పుడే లభిస్తుంది, ఈ లోకంతో చేరితే లభించదు. చాలామంది నా దగ్గరికి వచ్చి "స్వామీ! నాకు Peace (శాంతి) కావాలి" అని అడుగుతుంటారు. నేను చెబుతాను – "నాయనా! Peace అనేది బయట లేదు. బయట ఉన్నదంతా Pieces మాత్రమే. నీవే శాంతిస్వరూపుడవు. శాంతి నీయందే ఉండగా మళ్ళీ శాంతి కావాలని కోరటమెందుకు? నీ హృదయాన్ని నీవు అనుసరించు. తప్పక శాంతిని పొందగలవు, గమ్యాన్ని చేరుకోగలవు. ఏకాత్మభావాన్ని అలవర్చుకో. అప్పుడే నీ జీవితం ధన్యమౌతుంది." మానవునికి ముఖ్యంగా కావలసింది ఏకాత్మభావం. ఎన్నో కష్టములు వస్తుంటాయి. వాటిని లెక్కచేయకూడదు. మానవునికి చాలా చింతలున్నాయి.

**పుట్టుట ఒక చింత, భూమి నుండుట చింత**
**సంసార మొక చింత, చావు చింత**
**బాల్యమంతయు చింత, వార్థక్యమొక చింత**
**జీవించుటొక చింత, చెడువు చింత**
**కర్మలన్నియు చింత, కష్టములొక చింత**
**సంతసమొక చింత, వింత చింత!**

sri sathyasaivachanamrutam

అయితే అన్ని చింతలూ భగవచ్చింతనలో మాయమౌతాయి.

ప్రేమస్వరూపులారా! కేరళలో మీ ఇళ్ళలో మీరింతటి ఆనందాన్ని అందుకోలేరు. ఇక్కడ అందరూ కలసి పండుగను జరుపుకోవటంచేత ఎంతో ఆనందాన్ని అనుభవించగల్గుతున్నారు. పవిత్రమైన బలిచక్రవర్తి ఏలిన ప్రదేశం మీది. వామనమూర్తి పావనం చేసిన ప్రాంతం మీది. కనుక మీరు చాలా అదృష్టవంతులు, పుణ్యవంతులు. మీ ప్రాచీన సంస్కృతిని పోషించుకోండి. ఈనాడు ఆ సంస్కృతి పూర్తిగా కనుమరుగవుతున్నది. సంస్కృతి పోతే ఇంకేముంటుంది చెప్పండి. అంతా పోతుంది. కేరళలో ఆస్తికులందుగాని, నాస్తికులందుగాని అందరియందు మన ప్రాచీన సంస్కృతి నిలిచియున్నది. దానిని మీరు పోషించుకోండి. అదియే నేను కోరేది. నాలో ఎట్టి స్వార్థమూ లేదు. నాకు కావలసింది మీ ఆనందం, మీ ప్రేమ. కాబట్టి మీరు ప్రేమను అభివృద్ధిపరచుకోండి.

**(31-09-2001 ఉదయం సాయికుల్వంత్ సభామండపంలో శ్రీవారు అనుగ్రహించిన దివ్యసందేశము)**

sri sathyasai vahamrutam